## కథా సమీక్ష (May 02, 2004 - May 08, 2004) - by నిహార్



అమ్మకో ముద్దు - జీడిగుంట శ్రీరామచంద్రమూర్తి

వృద్ధాప్యంలో మంచాన పడ్డ తల్లి, విదేశాల్లో ఉండే ఇద్దరు కొడుకులు. ఈ పాత్రలని చూడగానే ఇది కొడుకుల కృతఘ్నతాభావం మీది కథ అనుకుంటాం. కానీ మూసకి భిన్నంగా ఉంటుందీ కథ. కథలో పెద్ద మార్పులు లేకున్నా, విషాదమైన ఇతివృత్తమైనా చదివించే గుణముందీ కథకు. కథనంలో మంచి నైపుణ్యం ఉంది.

నా రేటింగ్ : 3.5/5

మానవజన్మ - రావు కృష్ణారావు

కథ చివర్లో చెప్పినట్టు ఏదో పాత కథకు ఇది పొడిగింపు. చదువుతుంటే కాసేపు తలా, తోకా అర్థం కావు. సంబోధనలు అలా మధ్యలో తుంచి మార్చడమెందుకో అర్థం కాదు. ఐనా ఓపికగా చదివితే అప్పుడు విడుతుంది చిక్కుముడి. రిజర్వేషన్ కోసం ఓ అగ్రకులస్థుడిని మాలకులం వ్యక్తికి దత్తతనిస్తారు. కానీ మనుషుల్లో మాలిన్యం అంత త్వరగా పోదు కదా. ఆ విషయం గ్రహించిన కథానాయకుడు తన బాధ్యత తెలుసుకోవడంతో ముగుస్తుంది కథ. తీసుకున్న కథావస్తువు మంచిదే. ఓ మోస్తరుగా చెప్పారు కథని. కథనంలో గజిబిజి వల్ల ఓ సారి కష్టపడి చదవొచ్చు.

నా రేటింగ్ : 3.5/5

పెళ్ళిముచ్చట్లు - భమిడిపాటి సోమయాజి

పెళ్ళిచూపుల్లో ఆడపిల్లను పాడమని, నడవమని నానా ప్రశ్నలు వేసి వేధించే వాళ్ళు మగవాళ్ళనెవ్వరూ ఏదీ అడిగిచూడరేం? అన్న ప్రశ్న లేవనెత్తడం కథ ఉద్దేశ్యం అనుకుంటా. లేక మరేదైనా ఉందో? సినిమాల్లో కథకు సంబంధంలేకుండా నడిచే కామెడీ ట్రాక్ లా ఉంది కథ. రచయిత ఇంటిపేరు చూసి మంచి కథేమో అనుకొని ఆసక్తితో చదివాను. పేలవమైన కథనం. సోది కథ.

నా రేటింగ్: 2/5

మహాశిల్పి జోహార్ - సత్యవాడప్రియనందిని

ఏ బాలజ్యోతిలోనో, చందమామలోనో ప్రచురించవలసిన నీతికథ దారి తప్పి ఈ వారపత్రికకు వచ్చినట్టుంది. సరదాగా ఒకసారి చదువుకోవచ్చు.

మరికొన్ని కథలు

శతమానం భవతి - పేంపల్లి గంగాధర్

పద్దినాల సుట్టం (ప్రళయ కావేరి కథలు)

యాసను కాస్త ప్రయాసతో చదివితే ఈ ప్రళయకావేరి కథల్ని చక్కగా చదువుకోవచ్చు. నామిని గారు రాసిన 'పచ్చనాకు సాక్షిగ' తో మొదలయిన ఆత్మకథల సాంప్రదాయాన్ని ఖదీర్ బాబు దర్గా మిట్ట కథలు, సోమరాజు సుశీల గారి 'ఇల్లేరమ్మ కథలూ' కొనసాగించాయి. ప్రళయకావేరి కథలు కూడా ఆ కోవలోనివే. పులికాట్ సరస్సులో దీవుల్లో ప్రజల జీవనవిధానాన్ని హృద్యంగా చిత్రీకరిస్తున్నారీ రచయిత. కథలో ఒక్కొకడికి జరిగే అనుభూతులు సార్వజనీనం కాదని ఎవరైనా అనగలరా?

కమల - అల్లం రాజయ్య

91'లో వచ్చిన ఈ కథ గొప్ప తెలుగు కథల్లో ఎప్పటికీ నిలిచిపోదగ్గదని నా అభిప్రాయం. వీలయితే తప్పక చదవండి.

ఇవి చూసారా?

(వారం వారం ఎక్కడెక్కడో ప్రచురితమయ్యి, చాలా మంది మిస్ అయ్యే, మంచి "ఆర్టికల్స్"ని ఇక్కడ మరొకసారి పెడదామని మా ప్రయత్నం. సలహాలకు, సహకారానికి, 'టామ్ సాయర్' గారికి కృతజ్ఞతలు.)

1) గత ఆదివారం ఏదో 'ప్రపంచనవ్వుల దినోత్సవం' అట. నాలాగే బోలెడు మంది మిస్ అయ్యి ఉంటారు. అది మిస్ అయితే అయ్యారు.. ఆ సందర్భంగా ఈనాడు ప్రచురించిన ఈ నవ్వుల పువ్వుల్ని మాత్రం మిస్ అవకండి :)

- చమత్కార చురకత్తులు

- మాస్టారూ... మాస్టారూ...

- పూరీలు - ఎమ్మెస్ నారాయణ

- ఇదిగిడుగో బుడుగు - యమా సీరియస్స్

- అవధాని వాస్యోక్తులు

- ఎంటర్ ది డ్రాగన్ - తనికెళ్ళ భరణి

2) చాలా రోజులుగా లాఫింగ్ క్లబ్ ల గురించి చదువుతున్నాం కదా. వీటి పుట్టు పూర్వోత్తరాలివిగో...

3) మన హైదరబాదీ పెయింటర్ల

- పరిహద్దులు చెరుపుతున్న చిత్రకారుడు - స్టాన్లీ సురేష్

- భూమికి పచ్చని రంగేసే మరో చిత్రకారుడు - నరేందర్ రెడ్డి

---

మీ సూచనలూ సలహాలూ రచయిత నివార్ కి తెలియపరచండి.